సాక్షి
ఖమ్మం
బుధవారం। 6। మార్చి। 2024



... సమయం లేదు!

ఎస్సెస్సీ పరీక్షలకు తక్కువ సమయం ఉన్నందున విద్యార్థులు ప్రణాళికాయుతంగా సిద్ధం కావాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. 8లో



సేవాతత్వమే సాయి సంకల్పం

మానవళికి భగవాన్ సత్యసాయి అందించిన సేవాతత్వం గొప్పదని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
36° / 22°

వాతావరణం

జిల్లాలో బుధవారం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రతలు గరిష్టస్థాయికి చేరే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఏసీబీ డీఎస్పీకి సేవాపతకం



పతకం అందజేస్తున్న అడిషనల్ డీజీ

ఖమ్మంక్రైం: ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ సేవాపతకం అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం పలువురు అధికారులకు సేవాపతకాలను ప్రకటించింది. ఇందులో భాగంగా పతకానికి ఎంపికైన రమేష్‌కు మంగళవారం హైదరాబాద్‌లో ఏసీబీ అడిషనల్ డీజీ సీవీ.ఆనంద్ అందజేసి అభినందించారు.

డయల్ 100కు 3,726 ఫోన్లు

ఖమ్మంక్రైం: శాంతిభద్రతల సమస్యను నేరుగా తెలుసుకునేందుకు ప్రవేశపెట్టిన డయల్ 100కు ఫిబ్రవరి నెలలో 3,726 మంది ఫోన్ చేశారని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఇందులో 82 ఘటనలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని పేర్కొన్నారు. కాగా, అత్యవసర పరిస్థితుల్లోనే డయల్ 100ను వినియోగించుకోవాలని సీపీ సూచించారు.

రేషన్‌కార్డుల్లో తప్పుల సవరణ

ఖమ్మం సహకారనగర్: ఆహార భద్రతా కార్డు (రేషన్ కార్డు)ల్లో తప్పులు ఉంటే సంబంధిత పత్రాలతో తమ కార్యాలయంలో సంప్రదించి సరి చేయించుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ సూచించారు. ఆధార్‌కార్డు నంబర్ లేదా ఇతర తప్పులు దొర్లినా, ఈ కేవైసీ చేయించుకోని లబ్ధిదారులైనా రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

పంట రుణాలపై సమీక్ష

ఖమ్మంవ్యవసాయం: రానున్న ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేయాల్సిన పంట రుణాలపై సమీక్షకు డీఎల్‌టీసీ(డిస్ట్రిక్ట్ లెవల్ టెక్నికల్ కమిటీ) సమావేశాన్ని కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రస్తుత సంవత్సరం ఇచ్చిన రుణాలు, వచ్చే సంవత్సరానికి సంబంధించి రుణప్రణాళికలపై అధికారులు చర్చించారు. డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ ఏ.శ్రీనివాసరెడ్డి, డీఏఓ ఎం.విజయనిర్మల, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయ స్వామి, డీసీసీబీ సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 2.30 లక్షల మందికి 'జీరో బిల్లు'



సన్మానం అందుకున్న ఉద్యోగులతో ఎస్ఈ

నేలకొండపల్లి: జిల్లాలో ఇప్పటివరకు జీరో విద్యుత్ బిల్లులు అందని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎస్ఈ ఏ.సురేందర్ తెలిపారు. నేలకొండపల్లిలోని సబ్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి పథకం ద్వారా ఇప్పటివరకు 2.30 లక్షల మందికి బిల్లులు జారీచేయగా, ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందన్నారు. దరఖాస్తుల్లో తప్పులు ఉన్నా జీరో బిల్లు రాదని, అలాంటి వారు ప్రజాపాలన హెల్ప్ డెస్క్‌ల్లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. కాగా, 200 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగిస్తేనే జీరో బిల్లు వస్తుందని, అంతకు మించితే చెల్లించాలిస్సందేనని తెలిపారు. అనంతరం విద్యుత్ దినోత్సవం సందర్భంగా సిబ్బందిని ఎస్ఈ సన్మానించారు. డీఈఈ చింతమళ్ల నాగేశ్వరరావు, ఏడీ బి.వెంకటేశ్వర్లు, ఏఈ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.7కోట్లతో మత్స్య సంపద యోజన

జిల్లాలో 426 యూనిట్లకు అవకాశం

ఖమ్మంవ్యవసాయం: మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి రూపొందించిన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) పథకానికి రూ.6.99 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయగా, కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటీ ఆమోదించింది. మత్స్యకారులు దరఖాస్తు చేసుకున్న 426 యూనిట్లకు అవసరమయ్యే రూ.6.99 కోట్లు మంజూరు చేయాలని జిల్లా కమిటీ ఆమోదంతో మత్స్యశాఖ అధికారి డి.ఆంజనేయ స్వామి రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు సమర్పించారు. ఇందులో చేపల చెరువులు, విత్తన పిల్లల పెంపకం చెరువులు, దానా మిల్లులు, జీవనభృతి చెల్లింపుతో పాటు రిటైల్ ఔట్‌లెట్, ఆటో తదితర పథకాలు ఉన్నాయి. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు 60శాతం, బీసీ, ఓసీలకు 40శాతం సబ్సిడీ, మహిళలకు 60శాతం సబ్సిడీపై యూనిట్లు అందుతాయి. నిధులు మంజూరు కాగానే యూనిట్లు ఏర్పాటు చేసుకునే అవకాశముంది.

లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ త్వరలోనే వెలువడుతుందన్న సంకేతాలతో బీఆర్‌ఎస్ సమరానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా నామ నాగేశ్వరరావును బరిలో దింపుతున్నట్లు పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. దీంతో అన్ని నియోజకవర్గాల ముఖ్యనేతలతో సమన్వయ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఖమ్మంలో గురువారం జరిగే లోక్‌సభ పరిధి ముఖ్యనేతల సమావేశానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌తోపాటు ఎంపీలు నామ, వద్దిరాజు తదితరులు హాజరు కానున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



సమరానికి సన్నాహం..

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేలా బీఆర్‌ఎస్ వ్యూహాలు

- సిట్టింగ్ సీటు దక్కించుకునేలా ప్రణాళిక
- రేపు లోక్‌సభ పరిధి ముఖ్యనేతలతో సమన్వయ సమావేశం
- హాజరుకానున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ

అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవం

గత ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్‌కు పరాభవం ఎదురైంది. 2014, 2019 ఎన్నికల్లో ఒక్క సీటే దక్కించుకున్నా.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నేపథ్యాన ఇక్కడి ఓటమిని ఆ పార్టీ అధినేత కేసీఆర్ పరిగణనలోకి తీసుకోలేదు. కానీ ఈసారి కూడా గతంలో మాదిరిగానే ఒక సీటే రావడంతో నేతలు నిరాశ చెందారు. కేవలం భద్రాచలం నుంచి తెల్లం వెంకట్రావు మాత్రమే గెలుపొందగా.. పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఓడిపోవడంతో శ్రేణుల్లో నిస్తేజం అలుముకుంది. అయితే పార్లమెంట్ ఎన్నికలకు వారిని కార్యోన్ముఖులను చేసేలా పార్టీ అధినేత కేసీఆర్ తోపాటు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఉమ్మడి జిల్లాల నేతలతో సమావేశమవుతున్నారు.

గత ఎంపీ ఎన్నికల్లో విజయం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2018 శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అపజయం పాలైనా.. ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం సత్తా చాటింది. ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామ నాగేశ్వరరావు, కాంగ్రెస్ అభ్యర్థిగా రేణుకాచౌదరి పోటీ చేశారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించిన ఓటర్లు.. పార్లమెంట్‌కు వచ్చే సరికి బీఆర్‌ఎస్‌కు మద్దతు పలికారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావుకు 5,67,459 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి రేణుకాచౌదరికి 3,99,397 ఓట్లు వచ్చాయి. తద్వారా 1,68,062 ఓట్ల తేడాతో నామ విజయం సాధించారు.

సిట్టింగ్ స్థానంపై గురి

సిట్టింగ్ స్థానమైన ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గాన్ని మళ్లీ దక్కించుకునే లక్ష్యంతో బీఆర్‌ఎస్ అడుగులు వేస్తోంది. ఇందుకోసం ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే గులాబీ బాస్ సమీక్షలు ప్రారంభించారు. ఇప్పటికే ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించాలని, ఈ ఎన్నికల్లో గెలవడం ద్వారా బీఆర్‌ఎస్ సత్తా చాటాలని సూచించారు. ముందు నుంచే ఎన్నికలకు సన్నద్ధమయ్యేందుకు వీలుగా ఖమ్మం అభ్యర్థిగా సిట్టింగ్ అయిన నామ పేరునే ఖరారు చేశారు.

రేపు సన్నాహక సమావేశం..

లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా నేతలు, శ్రేణులను సమన్వయం చేసేందుకు గురువారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ ముఖ్యనేతలతో సమావేశమైన మాజీ సీఎం కేసీఆర్ చేసిన సూచనలపై విస్తృతంగా చర్చించడమే కాక ఉమ్మడి జిల్లాలోని నేతలకు పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాల్సిన ఆవశ్యకతను వివరించనున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన ప్రణాళిక, ఎక్కడ బలంగా ఉన్నాం.. ఎక్కడ బలహీనంగా ఉన్నామనే అంశాలను చర్చించే అవకాశముంది. కాగా, ఈ సమావేశానికి మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌తోపాటు ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు హాజరవుతారు. అలాగే, పార్టీ ప్రజాప్రతినిధులు కూడా హాజరు కావాలని సూచించారు.

జిల్లాకు చేరిన 'పూనమ్'

పోలీసు శాఖ డాగ్‌స్క్వాడ్‌లో చేరిక





జాగిలాన్ని పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్ (ఇన్‌సెట్) పూనమ్

ఖమ్మంక్రైం: మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న కొకర్ స్పానియల్ జాతికి చెందిన పది నెలల పూనమ్ అనే జాగిలాన్ని జిల్లాకు కేటాయించారు. పేలుడు పదార్థాలను కనుగొనడంలో కానిస్టేబుల్(హ్యాండ్లర్) ఎస్.కే.పాషా నేతృత్వాన ఈ జాగిలానికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా మంగళవారం సీపీ సునీల్‌దత్ ఈ జాగిలాన్ని పరిశీలించి మాట్లాడారు. నేర దర్యాప్తు సమయంలో పోలీసు జాగిలాల సేవలు కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.

జాతరల్లో అన్ని సౌకర్యాలు

- భక్తులు ఇబ్బంది పడకుండా చూడాలి
- మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్షలో కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ తదతరులు

ఖమ్మంసహకారనగర్: జిల్లాలోని తీర్థాల, స్నానాల లక్ష్మీపురంలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే జాతరలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. జాతరల సందర్భంగా ఆలయాల వద్ద క్యూలైన్లు, లైటింగ్ ఏర్పాటుచేయడమే కాక మిషన్ భగీరథ ద్వారా సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని, స్నాన ఘట్టాలు సిద్ధం చేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, డీపీఓ హరికిషన్, ఆర్డీవో జి.గణేష్, ఎస్ఈ సురేందర్, జెడ్పీ సీఈఓ వినోద్, డీఆర్‌డీఓ సన్యాసయ్య మిషన్ భగీరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ, మత్స్యశాఖ ఏడీ ఆంజనేయ స్వామి, దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ సులోచన, తహసీల్దార్ పి.రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● **ఖమ్మంగాంధీచౌక్:** ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించే మహాశివరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికను మంగళవారం కలెక్టర్ గౌతమ్ ఆవిష్కరించారు. ఆలయ సూపరింటెండెంట్ గౌరీశంకర్, ఈఓ చందూరు రామకోటేశ్వరరావుతో పాటు అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

● **ముదిగొండ:** అర్హులైన ప్రతీఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ముదిగొండలో మంగళవారం పర్యటించిన ఆయన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి వసతులపై ఆరా తీశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అనంతరం తహసీల్, మండల పరిషత్ కార్యాలయాలను తనిఖీ చేసి ధరణి, ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న ప్రత్యేక డ్రైవ్‌పై దృష్టి సారించాలని, ఎవరి దరఖాస్తు తిరస్కరించినా అందుకు కారణాలను పొందుపరచాలని చెప్పారు. గృహజ్యోతి తదితర పథకాలకు దరఖాస్తులు స్వీకరించేలా పని దినాల్లో ఉదయం 10–30నుంచి సాయంత్రం 5గంటల వరకు అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. తహసీల్దార్ వై.రామారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన 'యూనిటీ' మహాసభలు

- హాజరైన దేశ, విదేశీ ప్రతినిధులు
- కమ్యూనిస్టు విప్లవ శక్తులు, వ్యక్తులు ఏకం కావాలని పిలుపు



మాట్లాడుతున్న పోటు రంగారావు, వేదికపై సంజయ్ సింఘ్వీ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: మూడు విప్లవ పార్టీల విలీనం సందర్భంగా ఖమ్మంలో నిర్వహించిన 'యూనిటీ' సభలు మంగళవారం ముగిశాయి. సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్) పార్టీలకు చెందిన 16 రాష్ట్రాల ప్రతినిధులు, ఆహ్వానితులుగా ఏడు మిత్ర పార్టీల ప్రతినిధులతో పాటు జర్మనీ, నేపాల్ నుండి నాయకులు హాజరుకాగా, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఏర్పాటు సభలు కొనసాగాయి. తొలి రోజైన ఆదివారం ఖమ్మంలో భారీ ప్రదర్శన, సభ నిర్వహించగా.. సోమ, మంగళవారాల్లో 300 మంది ప్రతినిధులతో సభలు జరిగాయి. దేశ, విదేశాల నుండి హాజరైన నాయకులు విప్లవ పార్టీలు ఏకం కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఇది మార్గదర్శకం కావాలని ఆకాంక్షించారు.

సుదీర్ఘ చర్చలు..

ఏడాది కాలానికి పైగా చర్చల అనంతరం మూడు పార్టీలు విలీనం కాగా, ఖమ్మంలో ఐక్యతా మహాసభలను నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్‌గా జాతీయ పార్టీని ఏర్పాటు చేసి రెండు రోజుల పాటు 300 మంది ప్రతినిధులు జాతీయ పార్టీ నిర్మాణంపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పార్టీ నియమావళి, నిబంధనలు, భవిష్యత్ పోరాటాలు, రాజకీయ సిద్ధాంతాలు తదితర అంశాలపై చర్చించారు. కేరళ, త్రిపుర, జార్ఖండ్, అసోం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాల ప్రతినిధులు ఈ సభల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లాకు చెందిన నేతలు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథాగా చేసిన ఉద్యమాలు, పోరాటాలకు సంబంధించిన ఫొటో ప్రదర్శనఏర్పాటుచేయగా వివిధ ప్రాంతాల ప్రతినిధులు ఆసక్తిగా తిలకించారు. ఇక అరుణోదయ కళాకారులు తమ గేయాలతో ఆకట్టుకున్నారు.

మితవాదం పెరుగుతోంది..

కమ్యూనిస్టు విప్లవ శక్తులు, వ్యక్తులు ఏకం కావాల్సిన అవసరముందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర నాయకులు సంజయ్ సింఘ్వీ పిలుపునిచ్చారు. సభల్లో భాగంగా రెండో రోజు ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రాజ్యాధికారం, సమాజంలో మితవాదం పెరుగుతోందని తెలిపారు. సగానికి పైగా ప్రపంచాన్ని పాలించిన కమ్యూనిస్టు, సోషలిస్ట్ పార్టీలు ఇప్పుడు అల్పమైనవిగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక భారత్‌లో మోడీ నేతృత్వాన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగ సంస్థల ప్రాముఖ్యత తగ్గిపోయిందని తెలిపారు. అనంతరం మాస్‌లైన్ కేంద్ర ఆర్గనైజింగ్ కమిటీ నాయకుడు పోటు రంగారావు మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ పాలనలో భయాందోళన, హింసను ఎదుర్కొంటున్న ప్రజలు ఆ వ్యతిరేకతను ఓటు ద్వారా వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు కేజీ.రామచంద్ర, కె.రామచందర్, కె.రమ, దినేష్, గోహైన్, ధ్రువ, రిషి, ప్రదీప్ సింగ్ ఠాయూర్, కెచ్చెల రంగయ్య, దేవవ్రత శర్మ, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధస్థూపం ప్రాశస్త్యంపై విస్తృత ప్రచారం



బౌద్ధస్థూపం వివరాలు తెలుసుకుంటున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన కలెక్టర్ గౌతమ్

- మరింత అభివృద్ధికి ప్రణాళికలు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి: దక్షిణ భారతదేశంలోకెల్ల అతిపెద్దదైన బౌద్ధక్షేత్రం ప్రాశస్త్యంపై విస్తృత ప్రచారం చేస్తూ పర్యాటకంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆయన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బౌద్ధస్థూపాన్ని కలెక్టర్ గౌతమ్‌తో కలిసి పరిశీలించిన మంత్రి మాట్లాడుతూ ఎనిమిది ఎకరాల మేర స్థలం ఉన్నందున మరింత అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఆవరణలో గార్డెన్ తీర్చిదిద్దాలని, సమీపంలోని చెరువు అభివృద్ధిపై దృష్టి సారించడమే కాక రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న విశ్రాంతి భవనం పనులు పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు.

పదేళ్లలో బీఆర్‌ఎస్ సాధించిదేమీ లేదు....

పదేళ్ల పాటు తెలంగాణను పాలించిన బీఆర్‌ఎస్ సాధించిందేమీ లేదని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఆరోగ్య శ్రీ పథకం పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. అలాగే, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ ఇస్తుండగా, ఈనెల 11న భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఇక 85 రోజుల్లో 28 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టగా, 11,062 పోస్టులతో డీఎస్సీ ప్రకటించామని తెలిపారు. కాగా, ఎంపీ ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని మంత్రి కోరారు. ఈకార్యక్రమాల్లో జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్, పురావస్తు శాఖ ఏడీ నర్సింగ్‌నాయక్, ఎంపీపీ వజ్జా రమ్య, నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, రాయల నాగేశ్వరరావు, శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, వెన్నపూసల సీతారాములు, కె.హన్మంతరావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, వేగినాటి లక్ష్మీనర్సయ్య, ఎం.వెంకన్న, గరిడేపల్లి రామారావు, చెరువు స్వర్ణ, మేకల వెంకటేశ్వర్లు, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

ఖమ్మంరూరల్: వైద్యులు అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని తెల్దారుపల్లిలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తమ ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, ఎస్టీపీఓ నీలోహన, ఎంపీపీ బెల్లం ఉమ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి ఎదురుకావొద్దు



లహరి బస్సును ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్‌దత్, ఆర్టీసీ ఆర్‌ఎం వెంకన్న తదితరులు

- ముందస్తు ప్రణాళికలు రూపొందించండి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంసహకారనగర్: వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి ఎదురుకాకుండా ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో నీటి వనరుల లభ్యత, వినియోగంపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. పాలేరు, వైరా, లకారం, లంకపల్లి జలాశయాల్లో ఉన్న నీరు, వచ్చే నాలుగు నెలలకు ఎంత మేర కావాలనే అంశంపై స్పష్టత ఉండాలన్నారు. బేతుపల్లి తదితర జలాశయాల నుంచి నీటిని సమకూర్చుకుంటే భూగర్భ జలాలు పెరగడంతో పాటు బోర్లు, బావుల్లో నీటిమట్టం పెరుగుతుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ తాగునీటి లభ్యత, వినియోగంపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఎద్దడి రాకుండా చూస్తున్నామని తెలిపారు. దానవాయిగూడెంలోని ఫిల్టర్ బెడ్లతో పాటు లకారంలో 5 ఎంఎల్‌డీ ఫిల్టర్ బెడ్ల నుంచి నగరానికి నీరు సరఫరా చేస్తున్నామని, రోజువారీ వినియోగానికి .013 టీఎంసీల నీరు అవసరం కాగా.. ఏప్రిల్ 1 నాటికి ఒక టీఎంసీ నీటిని సమకూర్చుకుంటే వచ్చే నాలుగు నెలల పాటు ఇబ్బంది ఉండదని చెప్పారు. ఈ సమావేశంలో సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, ట్రాన్స్‌కో, ఇరిగేషన్ ఎస్ఈలు సురేందర్, ఆనంద్‌కుమార్, వివిధ శాఖల అధికారులు ఎస్.సదాశివకుమార్, పుష్పలత, వాణిశ్రీ, రంజిత్‌కుమార్, కృష్ణలాల్ పాల్గొన్నారు.

'లహరి' బస్సులు ప్రారంభం

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇటీవల ఆర్టీసీ ప్రవేశపెట్టిన లహరి బస్సుల్లో ఆరింటిని ఖమ్మం డిపోకు కేటాయించారు. ఇందులో నాలుగు ఏసీ, రెండు నాన్ ఏసీ బస్సులు ఉండగా వీటిని కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్‌దత్‌తో కలిసి మంత్రి కలెక్టరేట్ వద్ద ప్రారంభించారు. ఈసందర్భంగా తుమ్మల మాట్లాడుతూ 20బెర్తులు, 22సీట్లతో కూడిన బస్సులో అత్యాధునిక సదుపాయాలు ఉండగా, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవం అందుతుందని తెలిపారు. అనంతరం ఆర్‌ఎం సీహెచ్.వెంకన్న లహరి బస్సులను ఖమ్మం నుండి బెంగళూరుకు నడిపిస్తామని పేర్కొన్నారు. ఖమ్మం నుండి బెంగళూరుకు బెర్త్ రూ.2,690, సీట్ రూ.1,870లు, ఖమ్మం నుండి హైదరాబాద్‌కు బెర్త్ రూ.770, సీట్ రూ.560గా చార్జీ నిర్ణయించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం భవానీప్రసాద్, డీఎంలు బి.శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

రేపు ఎంపీ వద్దిరాజు అభినందన సభ

ఖమ్మంమయూరిసెంటర్: రెండోసారి రాజ్యసభకు ఎన్నికైన వద్దిరాజు రవిచంద్ర అభినందన సభ ఈనెల 7న ఖమ్మంలో ఏర్పాటుచేసినట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ తెలిపారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం బీసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నై షాపింగ్ మాల్ పక్కన ఖాళీ స్థలంలో గురువారం సాయంత్రం 4 గంటలకు మొదలయ్యే సభను విజయవంతం చేయాలని కోరారు. జెడ్పీ చైర్మన్ కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పాల్గొన్నారు.

10న మాజీ సీజేఐ ఎన్వీ రమణకు సన్మానం


మాట్లాడుతున్న ఎర్నేని రామారావు

ఖమ్మంమయూరిసెంటర్: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ.రమణ ఆత్మీయ సమ్మేళనం ఈనెల 10న ఏర్పాటు చేసినట్లు కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు ఎర్నేని రామారావు తెలిపారు. ఖమ్మంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వర్ణభారతి కల్యాణమండపంలో ఈనెల 10న ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొంటారని వెల్లడించారు. నాయకులు గొడవర్తి నాగేశ్వరరావు, నల్లమోతు రఘు, బండి మాధవరావు, రావూరి సైదుబాబు, తూము శివ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఇరిగేషన్ ఎస్ఈ

ఖమ్మం అర్బన్: వ్యక్తిగత కారణాలతో నెల రోజులుగా సెలవులో ఉన్న జలవనరుల శాఖ ఎస్ఈ నర్సింగరావు మంగళవారం విధుల్లో చేరారు. ఇంతకాలం కల్లూరు ఎస్ఈ ఆనంద్‌కుమార్ ఇక్కడ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యాన తాగునీటి ఎద్దడి నివారణపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉండడంతో ఎస్ఈ విధుల్లో చేరినట్లు తెలుస్తోంది.

కల్తీ డీజిల్ పోశారని ఫిర్యాదు

కల్లూరు: కల్లూరు ఖాన్‌ఖాన్‌పేటలోని ఓ బంక్‌లో బొలేరో వాహనంలో కల్తీ డీజిల్ పోశారంటూ వినియోగదారుడు ఆందోళనకు దిగాడు. పెనుబల్లి మండలం కుప్పెనకుంట్లకు చెందిన నేరెళ్ల నాగరాజు తన బొలేరో వాహనంలో సోమవారం రాత్రి 40 లీటర్ల డీజిల్ కొట్టించాడు. అయితే, కొద్దిదూరం వెళ్లగానే వాహనం ఆగిపోవడంతో కల్తీ డీజిలే కారణమంటూ ఆర్డీఓ కె.శ్రీనివాస్, తహసీల్దార్ సాంబశివుడు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే విషయాన్ని మెకానిక్‌లు చెప్పారని తెలిపాడు. దీంతో సివిల్ సప్లయిస్ డీటీ సత్యనారాయణ మంగళవారం ఉదయం డీజిల్ శాంపిల్ సేకరించారు.

13న బియ్యం వేలం

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన జప్తు చేసిన బియ్యాన్ని ఈనెల 13న వేలం పాట ద్వారా విక్రయిస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు. వివిధ గోదాంల్లో 8,336.19క్వింటాళ్ల బియ్యం నిల్వ చేయగా, కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో వేలం ఉంటుందన్నారు. డిస్టిలరీలు, బేవరేజస్ బాధ్యులు మాత్రమే అర్హులని, రూ.50వేల డీడీని అదనపు కలెక్టర్ పేరిట చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

చిన్నారి విక్రయం కలకలం

ఖమ్మంక్రైం: ఓ చిన్నారిని కిడ్నాప్ చేసి తీసుకొచ్చి విక్రయిస్తున్నారని మంగళవారం జరిగిన ప్రచారం కలకలం రేకెత్తించింది. ఖమ్మం పాత బస్టాండ్‌లో ఏడాది వయస్సు ఉన్న పాపతో మాసిన బట్టలు ధరించిన ఓ వ్యక్తి తిరుగుతుండగా, కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సిబ్బంది విచారించగా ఆయనే చిన్నారి తండ్రి అని తేలింది. చిత్తుకాగితాలు అమ్ముకునే సదరు వ్యక్తి భార్య చిన్నారిని వదిలేసి వెళ్లినట్లు గుర్తించారు. అనంతరం చిన్నారిని బాలల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన శిశు గృహకు తరలించారు.

నేడు వీసీ ప్రారంభం

ఖమ్మంవ్యవసాయం: రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను బుధవారం ప్రారంభించనున్నారు. జిల్లాలోని ఐదు యూనిట్లను వర్చువల్‌గా సీఎం ప్రారంభిస్తారని డీఏఓ విజయనిర్మల తెలిపారు.

విద్యార్థులారా.. సమయం లేదు!

- ఎస్సెస్సీ పరీక్షలకు మిగిలింది 12 రోజులే
- ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటేనే మేలు
- ప్రణాళికాయుతంగా చదివితే మంచి మార్కులు



ఖమ్మం సహకారనగర్: ఇన్నాళ్లు పాఠశాలలోనే వార్షిక పరీక్షలు రాసిన పదో తరగతి విద్యార్థులు తొలిసారి బోర్డ్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా కాస్త ఒత్తిడి ఉండడం సహజం. అయితే, పరీక్షలు సమీపిస్తున్న వేళ ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికా యుతంగా చదివితే మంచి మార్కులు వస్తాయని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలు ఈనెల 18న ప్రారంభం కానుండగా, మధ్యలో 12రోజుల సమయమే ఉంది. ఇప్పటి వరకు చదివింది ఒక లెక్క అయితే.. మిగిలిన సమయంలో చదవడాన్ని కీలకంగా భావించాల్సి ఉంటుంది. ప్రతీ విద్యార్థి కష్టంగా భావించే ఆంగ్లం, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించాలంటే పక్కా ప్రణాళిక అవసరం. ఈనేపథ్యాన ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు ఇచ్చిన సలహాలు, సూచనలు ఇలా ఉన్నాయి.

ఇష్టంతో చదవాలి..

పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల్లోనైతే రెండు, మూడు సార్లు కూడా పరీక్షలు జరిగాయి. ఈ నేపథ్యాన ఏ సబ్జెక్టులో తక్కువ మార్కులు వచ్చాయో బేరీజు వేసుకుని వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. పాఠశాలను బట్టీ పట్టినట్లు కాకుండా ఆయా అంశాలపై అవగాహన కలిగేలా శ్రద్ధతో చదివితే ఫలితం ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఒత్తిడిని జయించాలి..

బోర్డ్ పరీక్షలకు హాజరుకావడం తొలిసారి అయిన నేపథ్యాన విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. కానీ ఇవి కూడా పాఠశాలల్లో రాసిన పరీక్షలుగా భావించి ఒత్తిడిని దూరం చేసుకోవాలి. పరీక్షలో విజయం తమదేనని నమ్మకంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చేస్తున్న సూచనలను పాటిస్తూ ముందుకు సాగితే మంచి జీపీఏ సాధించడం సులభమని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. కాగా, ప్రశాంతంగా వాతావరణంలో ఉదయం 5గంటలకే లేచి చదివితే మంచిది. అలాగే, సబ్జెక్టులోని కీలకం అంశాలను ఎప్పటికప్పుడు నోట్స్‌గా రాస్తే పాయింట్ల వారీగా పరీక్షల్లో రాసేందుకు అవకాశముంటుంది. కఠినమైనదని భావిస్తూ ప్రతిరోజు ఒకే సబ్జెక్టు కాకుండా మార్చిమార్చి చదివితే అన్ని సబ్జెక్టులను కవర్ చేయడం సాధ్యమవుతుంది.

ప్రశ్నాపత్రంపై అవగాహన అవసరం



విద్యార్థులు ప్రశ్నాపత్రంపై అవగాహన కలిగి ఉండాలి. పార్ట్–ఏ, పార్ట్–బీలో ఏమేం ప్రశ్నలు వస్తాయి, వాటికి ఎన్నెన్ని మార్కులు ఉంటాయో తెలుసుకోవాలి. ప్యారాగ్రాఫ్‌లు ఇచ్చి ప్రశ్నలు అడిగితే ఒకటికి, రెండు సార్లు చదివి అర్థం చేసుకున్నాకే సమాధానం రాయాలి. చదివిన అంశాన్ని అర్థం చేసుకుంటే సులభంగా పరీక్ష రాయొచ్చు. కొన్ని ప్రశ్నల్లో చార్ట్ ఆధారంగా జవాబులు రాయాల్సి ఉంటుంది. ఇంగ్లిష్‌లో గ్రామర్ అత్యంత కీలకం. సమాధానాలు రాసే సమయాన తప్పులు లేకుండా చూసుకోవాలి.

– జక్కంపుడి జగదీశ్, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు, గుబ్బగుర్తి హైస్కూల్

ప్రశ్నాపత్రం క్షుణ్ణంగా చదవాలి..



విద్యార్థులు తొలుత ప్రశ్నాపత్రాన్ని క్షుణ్ణంగా చదవాలి. ప్రతీ లెక్కలో కనుగొనాల్సిన అంశాలు, దాని సూత్రాలను ఎంచుకుంటూ పరీక్ష రాయడం ప్రారంభించాలి. తద్వారా ప్రతీ ప్రశ్నకు కనీస మార్కులు సాధించొచ్చు. మొత్తం 80మార్కుల ప్రశ్నాపత్రంలో పార్ట్–ఏకు 60మార్కులు, పార్ట్ బీ–కి 20మార్కులు ఉంటాయి. ఇందులో 50శాతం ప్రశ్నలు సులభంగా, 30శాతం ప్రశ్నలు మధ్యస్తంగా, 20శాతం ప్రశ్నలు ఆలోచనాత్మకంగా ఉంటాయి. వీటిలో ప్రతీ ప్రశ్నను శ్రద్ధగా చదివి అర్థం చేసుకుంటే సులభంగా పరీక్ష రాయొచ్చు.

– మువ్వా ప్రసాద్, గణిత ఉపాధ్యాయుడు, మోమినాన్ హైస్కూల్

ఏకాగ్రత అవసరం..



ప్రతీ విద్యార్థి సైన్స్ సబ్జెక్ట్ విషయమై పాఠ్య పుస్తకంతో పాటు అభ్యాస దీపికపై పట్టు సాధించాలి. సైన్స్‌లో బొమ్మలు చక్కగా గీసి, భాగాలను గుర్తించడాన్ని ప్రాక్టీస్ చేయాలి. మూలకాల ఆవర్తన పట్టికను చక్కగా అవగాహన చేసుకోవాలి. ప్రతిరోజు సమయపాలన పాటిస్తూఅర్థవంతంగా చదువుకోవాలి. పూర్తి సమాచారంతో జవాబులు రాయడంపై శ్రద్ధ వహించాలి. అన్ని పాఠ్యాంశాలను చదువుతూనే అతిముఖ్యమైన అంశాలపై మరింత ఏకాగ్రత కనబర్చాలి. మొదటి ఆరు పాఠ్యాంశాలపై పట్టు సాధిస్తే మంచిది.

– ఎం.ఉపేంద్ర, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు, జెడ్పీహెచ్ఎస్, జక్కేపల్లి

ప్రణాళిక ముఖ్యం..



ప్రతీ విద్యార్థికి పరీక్షల సమయంలో ప్రణాళిక ముఖ్యం. ప్రతీ సబ్జెక్ట్‌కు కొంత చొప్పున సమయం కేటాయించాలి. ఆ సమయంలో ప్రణాళికాయుతంగా సబ్జెక్టుల్లోని కీలకాంశాలను క్షుణ్ణంగా చదవాలి. సోషల్ సబ్జెక్ట్ విషయానికొస్తే మ్యాప్ పెయింటింగ్, మ్యాప్‌లో వివిధ విభాగాలను గుర్తించడం కీలకంగా ఉంటుంది. ఈవిషయంలో ఒకటి రెండు సార్లు ప్రాక్టీస్ చేయడమే కాక తరచూ మననం చేసుకోవాలి. పరీక్షలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా ప్రయత్నం చేయడం ద్వారా మంచి మార్కులు సాధించొచ్చు.

– జి.శ్రీనివాసరావు, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడు, ఎం.వీ.పాలెం హైస్కూల్

సేవాతత్వమే సత్యసాయి సంకల్పం

- రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- సత్తుపల్లిలో సత్యసాయి సేవా నిలయం ప్రారంభం


మంత్రి, ట్రస్ట్ బాధ్యులకు భూమి పత్రాలు అందజేస్తున్న తుళ్లూరి పద్మ

సత్తుపల్లిటౌన్: ప్రపంచ మానవాళికి శ్రీ భగవాన్ సత్యసాయి అందించిన సేవాతత్వం ఎంతో గొప్పదని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లిలో ఏర్పాటుచేసిన శ్రీ సత్యసాయి ప్రశాంతి సేవా నిలయాన్ని మంగళవారం రాత్రి ఆయన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే.రత్నాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా తుమ్మల మాట్లాడుతూ 1995లో అప్పటి ప్రధాని పీ.వీ.నరసింహారావుతో కలిసి మంత్రిగా పుట్టపర్తి సత్యసాయిబాబాను కలిసినట్లు గుర్తు చేశారు. అనంతపురం జిల్లాలో తాగునీటి పరిష్కారానికి సత్యసాయి ట్రస్టు చేస్తున్న కృషిని కొనియాడారు. ట్రస్టీ రత్నాకర్ మాట్లాడుతూ 140 దేశాల్లో ట్రస్ట్ కార్యకలాపాలు కొనసాగుతుండగా, నిస్వార్థ సేవలు అందించడమే ట్రస్టు లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా సత్తుపల్లికి చెందిన తుళ్లూరి పద్మ సుమారు రూ.50లక్షల విలువైన మూడు గుంటల భూమిని ట్రస్ట్‌కు విరాళంగా అందజేశారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, సత్యసాయి సేవల జాతీయ కోఆర్డినేటర్ ఎస్.కోటేశ్వరరావు, మహిళా జాతీయ కోఆర్డినేటర్ శశిబాల, రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు పి.వెంకటరావు, డి.సుధాకర్‌తో పాటు గాదె సత్యనారాయణ, డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

మార్కెట్‌లో దళారుల దోపిడీని అరికట్టాలి


మంత్రి క్యాంపు కార్యాలయ ముట్టడికి వెళ్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో దళారుల దోపిడీని అరికట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. దళారీ వ్యవస్థతో రైతులు నష్టపోతున్నారని పేర్కొంటూ న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మంలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. ఈమేరకు పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించగా, కాంగ్రెస్ ప్రభుత్వం అలా చేయకుండా పంటలకు మద్దతు ధర కల్పించి స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలని కోరారు. అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకుడు డేవిడ్‌కుమార్ మాట్లాడగా నాయకులు మందుల రాజేంద్రప్రసాద్, బద్దూరి వెంకటరామిరెడ్డి, వై ప్రకాష్, మంగ, వై.జానకి, వెంకన్న, జి రమేష్, పాముల మోహన్‌రావు, ఎస్.కే.సుబహాన్, మస్తాన్ పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ బదిలీ

ఖమ్మం సహకారనగర్: సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ ఎస్.కే.అఫ్జల్‌హసన్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యాన బదిలీ చేశారు. ఆయనను డిప్యూటేషన్‌పై ములుగు జిల్లా డీఎంయూ(డిస్ట్రిక్ట్ మెయింటెనెన్స్ యూనిట్)కు కేటాయిస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్రీడా పాఠశాలల్లో విద్యార్థుల ఎంపికకు పోటీలు


ఎంపిక పోటీలను పరిశీలిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్/కారేపల్లి: పాల్వంచ మండలం కిన్నెరసాని, కాచనపల్లి, కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో క్రీడా పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు మంగళవారం పోటీలు నిర్వహించారు. కిన్నెరసాని, ఉసిరికాయలపల్లి పాఠశాలల్లో జరిగిన ఈ పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి విద్యార్థులు హాజరయ్యారు. పోటీలను దమ్మపేట ఏటీడీఓ చంద్రమోహన్, అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ బి.నెహ్రూ, క్రీడల కన్వీనర్ నామానాయక్ ప్రారంభించి మాట్లాడారు. కిన్నెరసానిలో పోటీలు మరో రెండు రోజులు కొనసాగనుండగా, ఉసిరికాయలపల్లిలో నిర్వహిస్తున్న పోటీలు ముగిశాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి బొల్లి గోపాల్‌రావు, ఏఎస్ఓ కొమరం వెంకటరమణతో పాటు నాగేశ్వరరావు, రాంబాబు, చందు, బుగ్గ వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, హరికృష్ణ, వెంకటేశ్వర్లు, డి.రవి పాల్గొన్నారు.

గృహజ్యోతి దరఖాస్తులకు ప్రత్యేక కౌంటర్లు


ఖమ్మం శ్రీనివాస్‌నగర్‌లో దరఖాస్తులు సమర్పిస్తున్న వినియోగదారులు

ఖమ్మంవ్యవసాయం: గృహజ్యోతి పథకానికి అర్హత కలిగినా 'జీరో' బిల్లులు అందని వినియోగదారులు మరోమారు దరఖాస్తులు చేసుకునేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ప్రజాపాలన సభల్లో దరఖాస్తు చేసుకుని, 200 యూనిట్ల లోపు విద్యుత్ ఉపయోగించుకున్న వారికి ఈనెల నుంచి జీరో బిల్లులు జారీ చేస్తున్నారు. అయితే, పలువురికి జీరో బిల్లులు రాకపోవడంతో తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఎంపీడీఓ, మున్సిపాలిటీ కార్యాలయాల్లో ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు. అలాగే, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఇంటి పన్నుల వసూళ్లకు ఏర్పాటుచేసిన కౌంటర్ల వద్ద అదనపు సిబ్బందిని కేటాయించి ఉచిత విద్యుత్ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి




మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మహాసభలో మంత్రులు తుమ్మల, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం వైద్యవిభాగం: గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామీణ వైద్యుల సహాయక సంఘం ఉమ్మడి జిల్లా 23వ మహాసభ ఖమ్మంలో మంగళవారం నిర్వహించారు. ఈ సభకు జిల్లా అధ్యక్షుడు బాలబోయిన వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా మంత్రులు ముఖ్యఅతిథులుగా మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్యం అందించడంలో ఆర్ఎంపీలు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కాగా, దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో అర్హులైన గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీ చేయగా, బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం విస్మరించిందని తెలిపారు. ఇక నుంచి శిక్షణ ఇప్పించడమే కాక అర్హులైన గ్రామీణ వైద్యులకు వైద్య ఆరోగ్య శాఖలో అవకాశాలు కల్పించే ఆలోచన చేస్తామన్నారు. కాగా, వేదిక పైనుంచే వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కమిషనర్‌తో మంత్రి తుమ్మల మాట్లాడి గ్రామీణ వైద్యుల సమస్యలను వివరించారు. సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు వీరాచారి, వెంకన్న, ఎం.శ్రీనివాసరావు, ఏ.అమృతరావు, ఎం.వెంకటేశ్వర్లు, సోమశేఖర్, ఓబ్బి శ్రీనివాసరెడ్డితో పాటు స్వర్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం జేఎన్‌టీయూ నుంచి దంపతులకు డాక్టరేట్


డాక్టరేట్ పట్టాలతో బలరామ్, మమత

కొణిజర్ల: కొణిజర్ల శివారు వెంకటాపురం(జమ్మికొయ్యబంజర) గ్రామానికి చెందిన దంపతులకు కంప్యూటర్ సైన్స్ విభాగంలో డాక్టరేట్ లభించింది. గ్రామానికి చెందిన ఏ.బలరామ్ ఇబ్రహీంపట్నంలోని సెయింట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ హెచ్‌ఓడీగా పనిచేస్తుండగా, ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.వసుంధర్ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాపత్రానికి ఏపీలోని అనంతపురం జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. అలాగే, బలరామ్ సతీమణి మమత హైదరాబాద్‌లోని శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ హెచ్‌ఓడీగా పనిచేస్తూ ప్రొఫెసర్లు డాక్టర్ బి.రామసుబ్బారెడ్డి, డాక్టర్ సి.శోభాబిందు పర్యవేక్షణలో పరిశోధనాపత్రం సమర్పించగా అనంతపురం జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్ లభించింది. ఈసందర్భంగా జేఎన్‌టీయూలో జరిగిన కార్యక్రమంలో ఏపీ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, వీసీ డాక్టర్ రంగా జనార్దన్ చేతుల మీదుగా వారు డాక్టరేట్లు స్వీకరించగా పలువురు అభినందించారు.

జాతీయ ఉద్యాన మేళాలో ఖమ్మం రైతులు


ఉద్యాన మేళాలో పాల్గొన్న రైతులు

ఖమ్మంవ్యవసాయం: బెంగళూరులోని జాతీయ ఉద్యాన పరిశోధన స్థానంలో నిర్వహిస్తున్న ఉద్యాన మేళాకు ఖమ్మం జిల్లా రైతులు హాజరయ్యారు. దేశ నలుమూలల నుంచి ఇరవై రాష్ట్రాలకు చెందిన రైతులు పాల్గొంటుండగా, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు జిల్లా నుంచి ఉద్యాన శాఖ అధికారులు 50 మంది రైతులను మేళాకు పంపించారు. ఈ సందర్భంగా అక్కడ పండ్లు, పూల కొత్త వంగడాలు, కూరగాయల నాటు రకాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారులు ఎ.వేణు, జి.నగేశ్, రైతులు నల్లమల వెంకటేశ్వరరావు, వెంపటి లక్ష్మీనారాయణ, నెల్లూరి వీరబాబు, జంగా రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పండితాపురం సంత వేలం వాయిదా

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి(పండితాపురం)లో శ్రీ కృష్ణప్రసాద్ పశువుల వారాంతపు సంతకు మంగళవారం బహిరంగ వేలం జరగాల్సి ఉండగా వాయిదా వేశారు. కలెక్టర్ గౌతమ్ సూచనతో వేలంను వాయిదా వేయగా, మళ్లీ ఎప్పుడు జరిగేది త్వరలోనే వెల్లడిస్తామని జీపీ ప్రత్యేకాధికారి రవీందర్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూ తెలిపారు.

తీర్థాల జాతరకు సిద్ధం

ఖమ్మం రూరల్ మండలం తీర్థాలలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా నుంచే కాక భద్రాద్రి, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల నుంచి భక్తులు ఈ జాతరకు హాజరవుతారు. ఇక్కడి సంగమేశ్వర స్వామి ఆలయానికి రంగు వేయించడంతో పాటు బారికేడ్లు నిర్మించారు. అలాగే ప్రత్యేకంగా రోడ్లు వేస్తున్నారు. ఈ పనులన్నీ చివరి దశకు చేరాయి. కాగా, ప్రస్తుతం మున్నేరులో స్నాన ఘట్టాల వద్ద నీళ్లు లేకపోగా.. జాతర సమయానికి అధికారులు ఏమైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తారో వేచి చూడాల్సి ఉంది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్


రంగులు వేయడంతో కళ సంతరించుకున్న సంగమేశ్వరస్వామి ఆలయం


ఆలయం ముందు ఏర్పాటు చేసిన బారికేడ్లు


మున్నేరు చెక్‌డ్యామ్ నుంచి ఆలయం వరకు వేస్తున్న రోడ్డు